మహిళా దినోత్సవం

సాక్షి నల్లగొండ

రేపటికి ముందడుగు

బుధవారం । 8 । మార్చి । 2023

న్యూస్‌రీల్

9 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

శాలిగౌరారం : మండలంలోని పెర్కకొండారం గ్రామంలో ఈ నెల 9 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గౌడ హాస్టల్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సుంకరి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. జీనెక్స్ సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పెర్కకొండారం ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ. 5వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. వివరాలకు 83094 17525, 72860 01054 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

సాగర్‌ను సందర్శించిన జిల్లా ప్రధాన జడ్జి



బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న న్యాయమూర్తి కుటుంబ సభ్యులు

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్ మంగళవారం కుటుంబ సమేతంగా బుద్ధవనాన్ని సందర్శించారు. విజయవిహార్ వద్ద వీరికి నిడమనూరు కోర్టు న్యాయమూర్తి స్వప్న, సాగర్ సీఐ నాగరాజు, ఎస్సై రాంబాబులు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. అనంతరం నాగార్జునకొండ మ్యూజియం సందర్శనకు లాంచీలో వెళ్లారు. మ్యూజియంలోని అలనాటి నాగరికత విశేషాలు తెలుసుకున్నారు. బుద్ధుని శిల్పాలు పరిశీలించారు. బుద్ధవనంలోని బుద్ధుని పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. బుద్ధవనంలోని జాతక పార్కు, స్థూపపార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు.

వైభవంగా వసంతోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం వసంతోత్సవం, హోలీ వేడుకను వైభవంగా నిర్వహించారు. ప్రథమ ప్రాకారంలో శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, చిలుకల పేర్లు వేశారు. అనంతరం ఆలయ తిరు, మాఢ వీధుల్లో హోలీ సేవను ఊరేగించారు. అనంతరం ప్రథమ ప్రాకారంలో శ్రీస్వామి, అమ్మవార్ల సేవను వేంచేపు చేసి వేద పారాయణం నిర్వహించారు.




మళ్లీ జన్మంటూ ఉంటే.. ఆడపిల్లగానే పుడతాం

- కాలేజీ, పని ప్రదేశం ఎక్కడైనా తప్పని వేధింపులు
- వాటన్నింటినీ అధిగమించి స్వతంత్ర జీవనం
- అధికారం ఉంటే మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు
- 'సాక్షి' సర్వేలో వివిధ రంగాల మహిళల మనోగతం

మహిళా దినోత్సవం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మళ్లీ జన్మంటూ ఉంటే అమ్మాయిగానే పుడతామంటున్నారు నేటి మహిళలు. అబ్బాయికంటే అమ్మాయిగా ఉండడానికే ఇష్టపడుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నా.. ఉన్నతాధికారిణిగా ఉన్నా.. పని ప్రదేశాల్లో వేధింపులు ఎదురవుతున్నా వాటన్నింటిని అధిగమిస్తూ స్వతంత్రంగా జీవిస్తున్నారు. సొంతింట్లోనే ఆడ మగ వివక్ష ఉన్నా, సోషల్ మీడియా ద్వారా టీజింగ్ ఎదురవుతున్నా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నారు. తమకు శిక్షించే అధికారం లభిస్తే మహిళలపై హింస, ఇతరత్రా నేరాలపై కఠినంగా వ్యవహరిస్తామని చెబుతున్నారు. ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన ప్రత్యేక సర్వేలో వివిధ రంగాలకు చెందిన మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యారంగం, ఆర్టీసీ, పోలీసు, అంగన్‌వాడీ తదితర ప్రభుత్వ రంగాలకు చెందిన ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, టీచర్లు ఈ సర్వేలో భాగస్వాములయ్యారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో నిర్వహించిన ఈ సర్వేలో ఒక్కో జిల్లాలో వంద మంది చొప్పున 300 మంది మహిళలు పాలు పంచుకున్నారు. తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించారు. వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలివే..



- మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 300 మంది మహిళలు, ఉద్యోగినులు, విద్యార్థినులకు నాలుగు ప్రశ్నలు వేసి వారి అభిప్రాయాలను తీసుకున్నాము.

భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



మహిళా దినోత్సవం జరుపుకోవడం అంటే ఆటలాడి, పాటలు పాడి కేకులు కోసి సంబరాలను జరుపుకోవడం కాదు. ఎవరో నలుగురికి శాలువాలు కప్పి సన్మానించడం అంతకంటే కాదు. ప్రతి మహిళ తన జీవితంలో సాధించిన ప్రగతిని సమీక్షించుకుని భవిష్యత్‌లో చేయాల్సిన అంశాలకు బాటలు వేసుకొని, వాటి అమలుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవడమే అసలైన మహిళా దినోత్సవం. – ఉప్పల పద్మ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, మిర్యాలగూడ

ఉన్నత చదువులతోనే రాణింపు



సమాజంలో సగ భాగమైన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ఉన్నత చదువులు చదవాలి. ప్రభుత్వాలు మహిళల కోసం మరిన్ని చట్టాలను తీసుకురావాలి. మహిళలకు ఎన్నో చట్టాలు ఉన్నా ప్రస్తుతం ఎక్కడో ఒకచోట వివక్ష తప్పడం లేదు. – మోహన, బీటెక్, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, సూర్యాపేట

అన్నింటా సమానత్వం ముఖ్యం



ప్రతి ఒక్క రంగంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కల్పించాలి. లైంగిక దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు ఉండాలి. మహిళా స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. – కానుగు సాయి ప్రసన్న, ప్రైవేట్ ఉద్యోగిని, వంగపల్లి, యాదాద్రి జిల్లా

వివక్షలేని సమాజాన్ని నిర్మించాలి



మహిళలపై నేటి సమాజంలో వివక్ష ఎక్కువగా ఉంది. ప్రతి ఇంట్లో మగ పిల్లలు చెల్లి, అక్క, తల్లితో ఎలా మెలుగుతున్నారో బయట సమాజంలో కూడా అలానే ఉండేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. మహిళలపై వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. – కడియం రాజేశ్వరి, మహిళా కానిస్టేబుల్, మిర్యాలగూడ వన్‌టౌన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలి. తల్లిగా లాలిస్తూ, భార్యగా బాగోగులు చూస్తూ నిరంతరం పనిచేసే గొప్ప సేవకురాలు మహిళ. అలాంటి మహిళలు ఇంటికే పరిమితం కావద్దు. బాగా చదువుకుని ఉద్యోగాలు సాధించి వివిధ రంగాల్లో రాణించాలి. అప్పుడే ఆయా రంగాలతోపాటు సమాజం మరింత అభివృద్ధి చెందుతుంది. – బి.సునీత, స్టాఫ్ నర్స్, సూర్యాపేట

చిన్న విషయాలకు నిరుత్సాహ పడొద్దు



ప్రతి చిన్న విషయానికి నిరుత్సాహానికి గురికావద్దు. మహిళ పుట్టుకతోనే శక్తివంతురాలు. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటూ కుటుంబాన్ని, పిల్లలను ఒక స్థాయిలో నిలబెడుతుంది. మహిళలు చిన్న విషయాలకు కుంగిపోతే జీవితంలో ఏమీ సాధించలేరు. సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లకు దూరంగా ఉండాలి. చిన్న కారణాలకే తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థినులను చూస్తున్నాం. అది కరెక్ట్ కాదు ధైర్యంగా ఉండాలి. ఎలాంటి సమస్య అయినా ఎదురొడ్డి నిలబడాలి. – నళిని, హెల్త్ అసిస్టెంట్, నల్లగొండ

మహిళల రక్షణ, సంక్షేమానికి పెద్దపీట

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : మహిళల రక్షణకు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నారీ లోకానికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా పక్షపాతి అని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లలో మహిళల సంక్షేమానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. షీ టీమ్స్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్లు ఇందుకు తార్కాణాలు అని ఆయన పేర్కొన్నారు. ఇవిగాక విద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మహిళలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని కొనియాడారు. తెలంగాణ రాజకీయాల్లో చట్టసభలతో పాటు నామినేటెడ్ పదవుల్లో ఉన్న మహిళల సంఖ్య 67,486 (50.07) శాతంగా ఉందని ఆయన వెల్లడించారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న సీఎం కేసీఆర్‌కు భవిష్యత్‌లోనూ బాసటగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.

పురస్కారాలకు ఎంపిక



డాక్టర్ సుజాత



అన్వితారెడ్డి

రామగిరి(నల్లగొండ), భువనగిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న మహిళలకు అవార్డులు ప్రకటించింది. 2023 సంవత్సరానికి వివిధ రంగాలకు చెందిన మొత్తం 27 మంది మహిళలను అవార్డులకు ఎంపిక చేసింది. జానపద సాహిత్యంలో నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన డాక్టర్ బండారు సుజాత ఎంపికయ్యారు. మౌంటనీర్ (పర్వతారోహణ) విభాగంలో భువనగిరి పట్టణానికి చెందిన అన్వితారెడ్డిని అవార్డు వరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి భారతి హోళీకేరి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం వరంగల్‌లో జరిగే కార్యక్రమంలో వారికి అవార్డుతో పాటు రూ.లక్ష చొప్పున నగదు పురస్కారాన్ని అందజేయనున్నారు.

గెస్ట్ ఎడిటర్ రోల్ బాగా నచ్చింది

మహిళా గెస్ట్ ఎడిటర్ రోల్ నాకు చాలా బాగా నచ్చింది. ఇక్కడికి వచ్చి నేను ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఒక పత్రిక వెలువడడానికి ఇంతమంది శ్రమ దాగి ఉందని నాకు తెలియదు. తెరవెనుక ఉండి నడిపిస్తున్న సిబ్బంది, వారి పనితీరు నాకు స్ఫూర్తినిచ్చింది. - సల్మాబాను



సాక్షి కార్యాలయంలో గెస్ట్ ఎడిటర్‌గా విధులు నిర్వహిస్తున్న సల్మాబాను

- ఎడిటర్ విధులు కత్తి మీద సామే..
- ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ సల్మాబాను
- మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి యూనిట్ కార్యాలయంలో 'మహిళా గెస్ట్ ఎడిటర్'గా విధులు
- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ఆహ్వానం మేరకు ఎస్సీ కార్పొరేషన్ నల్లగొండ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సల్మాబాను మంగళవారం యూనిట్ కార్యాలయంలో గెస్ట్ ఎడిటర్‌గా ఒక్కరోజు విధులు నిర్వర్తించారు. 'మహిళా గెస్ట్ ఎడిటర్'గా ముఖ్యమైన వార్తలపై ఎడిటోరియల్ సిబ్బందితో చర్చించారు. వార్తల ప్రాధాన్యత, ఎడిటింగ్, పేజినేషన్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కొన్ని వార్తలకు శీర్షికలను కూడా పెట్టారు. మహిళల్లో చైతన్యం కలిగించే వార్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అదే విధంగా యూనిట్ కార్యాలయంలో వివిధ విభాగాలను పరిశీలించారు. పత్రిక ప్రింటింగ్ విధానం, సిబ్బంది విధులు, టెక్నికల్ అంశాల గురించి కూడా తెలుసుకున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి..

రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు కల్పించిందని, వాటిని అందిపుచ్చుకోవాలంటే కేవలం చదువు వల్లే సాధ్యమవుతుందని సల్మాబాను చెప్పారు. ప్రస్తుతం సమాజంలో మహిళలకు ఉన్న అవకాశాలు, మహిళలు ఉన్నతంగా ఎదగాల్సిన ఆవశ్యకతపై మాట్లాడుతూ.. తాను ఆఫీసర్‌గా గుర్తింపు పొందానంటే అది రాజ్యాంగంలో కల్పించిన హక్కుల వల్లేనని అన్నారు. తాను ఈ స్థాయిలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందని, ప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు, అన్ని రకాల సదుపాయాలు గురించి అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలకు మంచి చదువులు చెప్పించి ఆర్థికంగా వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడేలా కృషిచేయాలి ఆమె సూచించారు.

హేళన చేసిన వాళ్లే.. గొప్పగా చెబుతున్నారు..

చిన్నప్పుడు తన అమ్మానాన్నను చాలా మంది.. ఆడ పిల్లలను ఎందుకు చదివిస్తున్నారు అని అనడం తాను చూశానని. అయినా వారు కష్టపడి తనను చదివించారని చెప్పారు. అప్పటి నుంచే తాను సమాజంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలి అనే దిశగా కష్టపడి చదివి ఉద్యోగం సాధించానని, ఆరోజు హేళన చేసిన వాళ్లే ఈ రోజు తన గురించి గొప్పగా చెప్పుకునే స్థాయికి చేరుకోగలిగానని సల్మాబాను చెప్పారు. మహిళలైనా, విద్యార్థినులైనా పనిచేసే చోట, కళాశాలలు, పాఠశాలల్లో జరిగిన విషయాలను ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలతో కలిసిపోయి ప్రతి విషయాన్నీ చర్చించాలని చెప్పారు. కొందరు చిన్న చిన్న విషయాలకు ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడుతుండడం బాధ కలిగిస్తోందని అన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు.



వార్తలను పరిశీలిస్తున్న సల్మాబాను



ఎడిటోరియల్ సిబ్బందితో మాట్లాడుతున్న గెస్ట్ ఎడిటర్ సల్మాబాను

టెక్నాలజీకి అనుగుణంగా పత్రికా రంగంలో మార్పులు

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పత్రికా రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అరచేతిలో ఉండే సెల్ ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు వార్తలు వస్తున్న ఈ రోజుల్లో జర్నలిజం వ్యాల్యూస్‌తో పనిచేస్తున్న 'సాక్షి' సిబ్బందిని ఆమె అభినందించారు. తనకు గెస్ట్ ఎడిటర్ అవకాశం కల్పించిన సాక్షి యాజమాన్యానికి సల్మాబాను కృతజ్ఞతలు తెలిపారు. ఎడిటర్‌గా పత్రికను నిర్వహించడం కత్తి మీద సామేనని పేర్కొన్నారు.

● ఆనంద కేళీ



నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువతులు



ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో ఎస్పీ అపూర్వరావు, సిబ్బంది

మన కోసం మనమే మాట్లాడాలి

- మహిళలకు చదువుతో పాటు ధైర్యం చాలా ముఖ్యం
- కష్టాల్లో ఉన్నవారికి సాయపడాలి
- కుటుంబ సభ్యులు, బంధువుల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి ఎదిగా
- 'సాక్షి'తో కలెక్టర్ పమేలా సత్పతి

మన కోసం మనమే మాట్లాడాలి.. మన గురించి మనమే మాట్లాడాలి.. అప్పుడే మహిళా సాధికారతకు అడుగులు పడుతాయి. బయటివాళ్లు తమకోసం మాట్లాడుతారనుకోవడం తప్పు.. ఒక మహిళ మరో మహిళకు సహాయపడాలి.. తద్వారా కష్టాల నుంచి దూరం చేసి వారి ఉన్నతికి తోడ్పాటునందించినవారం అవుతాం.. అమ్మాయిలకు చదువుతో పాటు ధైర్యం కూడా చాలా ముఖ్యం అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షితో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

- సాక్షి, యాదాద్రి



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

మహిళల్లో ఎంతో మంది పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివి ఉన్నతమైన హోదాలో ఉన్నారు. అయినా భయాన్ని వీడడం లేదు. గృహహింసతో పాటు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటూ మౌనంగా ఉంటున్నారు. అలాంటి స్థితినుంచి బయటకు రావాలి. హింసను ధైర్యంగా ఎదుర్కోవాలి. ప్రతి మహిళా తనకంటూ ఒక ప్రత్యేకత సాధించుకోవాలి. స్వశక్తితో తన కాళ్లపై తాను నిలబడాలి. చదువు రాకపోయినా ప్రతి మహిళలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే ఎక్కడైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించవచ్చు. పురుషుల కంటే మహిళ బలహీనురాలన్న అపోహ సమాజంలో ఉంది. కానీ, మహిళ కూడా శక్తిమంతురాలే. పోలీస్, మిలటరీ, నేవీ, వ్యాపారం.. ఇలా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, సైంటిస్టులుగా రాణిస్తున్నారు.

నేను చాలా అదృష్టవంతురాలిని

మా ఇంట్లో అందరూ విద్యావంతులే. అమ్మా, నాన్న సైంటిస్టులు. వాళ్ల తల్లిదండ్రులు వారిని బాగా చదివించారు. మా అమ్మానాన్న నన్ను, నా చెల్లిని అదే తరహాలో చదివించారు. ఒక విధంగా చెప్పాలంటే నేను చాలా అదృష్టవంతురాలిని. వివాహం చేసుకున్న అనంతరం కూడా కుటుంబం నుంచి నాకు మద్దతు లభించింది. బంధువులు, చుట్టు పక్కలవాళ్ల సహకారం కూడా తోడైంది. అందరి ఆశీస్సులతో ఐఏఎస్ సాధించా. నా చెల్లి కూడా ఉద్యోగం చేస్తుంది. ప్రస్తుత సమాజంలో చాలా మందికి ప్రోత్సాహం లేదు. ఉన్నతస్థాయికి వెళ్లాలంటే నాలాగే అందరికీ సహకారం లభించాలని కోరుకుంటున్నా.

పిల్లల కెరీర్‌పై తల్లుల ప్రభావం

తల్లిదండ్రుల మార్గంలో పిల్లలు పయనిస్తుంటారు. కాబట్టి వారి పెంపకం, భవిష్యత్‌పై ప్రత్యేక శ్రద్ధ, బాధ్యత కలిగి ఉండాలి. ఉద్యోగం వ్యాపారం ఇలా ఏ రంగంలోనైనా ఆర్థికంగా ఎదుగుతున్న తల్లులు.. ఉన్నతస్థాయికి వెళ్లేలా కెరీర్‌ను మరింత వృద్ధి చేసుకోవాలి. వర్కింగ్ విమెన్ తన కుటుంబం మాదిరిగానే ఆఫీస్ గురించి ఆలోచించాలి. తద్వారా తమ పిల్లల కెరీర్‌ను కూడా తీర్చిదిద్దగలుగుతారు. పిల్లలు కూడా అదే బాటలో పయనిస్తారు.ఒక మహిళ సాటి మహిళకు తోడుగా ఉండాలి. అవసరమైనప్పుడు సహకారం అందించాలే కానీ, సమస్యలు సృష్టించకూడదు. అప్పుడే సమాజం కూడా ఉన్నతిగా ఉంటుంది.

క్లుప్తంగా

విద్యార్థులకు గ్రామీణ అనుభవం కీలకం



సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

గరిడేపల్లి : బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు వ్యవసాయ స్థితిగతులపై గ్రామీణ అనుభవం ఎంతో కీలకమని కేవీకే శాస్త్రవేత్తలు అన్నారు. మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో లయోలా అకాడమి సికింద్రాబాద్‌కు చెందిన బీఎస్సీ ఆగ్రికల్చరల్ విద్యార్థులకు నిర్వహించిన అనుభవ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. నూతన సాగు విధానం, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్ నరేష్, కిరణ్, ఆదర్శ్, మాధురీ, నరేష్, సుగంధీ, కంప్యూటర్ ప్రోగ్రామర్ నరేష్, లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపల్ మరియాదాస్, బ్లాక్ ఇంచార్జీ ఫాదర్ ప్రభు, ప్యాకల్టీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న ప్రముఖులు



సందీప్‌కుమార్ సుల్తానియాకు ప్రసాదం ఇస్తున్న అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.శ్రీనివాసరాజు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, మల్టీజోన్ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి వేర్వేరుగా తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన వంటి పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

వ్యక్తి దారుణ హత్య

- కత్తులతో దాడి చేయడంతో గొంతులో గాయం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఆలేరు మండల పరిధిలో ఘటన

ఆలేరురూరల్ : ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆలేరు మండల పరిధిలో మంగళవాం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మల్లూరు శ్రీను (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హోలీ వేడుకల అనంతరం సాయంత్రం శ్రీను గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రత్యర్థులు శ్రీనుపై కత్తులతో దాడి చేశారు. శ్రీనుకు గొంతులో బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు గమనించేలోపే దుండగులు అక్కడినుంచి పారిపోయారు. కుటుంబ సభ్యులు శ్రీనును జనగామ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే, శ్రీనుకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో గొడవలు జరుగుతున్నాయి. పాతకక్షలను మనసులో పెట్టుకుని ఆ వ్యక్తే మరో ఇద్దరితో కలిసి దారుణానికి ఒడిగట్టి ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇద్రీస్ అలీ తెలిపారు.

అమ్మలకే అమ్మ.. పిచ్చమ్మ

- అనాథాశ్రమం స్థాపించి వృద్ధ మహిళలకు అండగా..
- తోబుట్టువులా తోడుంటూ 20 ఏళ్లుగా నిస్వార్థ సేవ
- గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందజేత



రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పిచ్చమ్మ



వృద్ధులకు సేవ చేస్తున్న పిచ్చమ్మ

నల్లగొండ టౌన్ : కన్నబిడ్డలు ఆదరించక.. తోబుట్టువులు దగ్గరకు తీయక.. జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసి కట్టుకున్నోడు దూరమైన వృద్ధ మహిళలకు నేనున్నానంటూ ఆశ్రయం కల్పిస్తూ అమ్మలా సాకుతోంది ఆమె. దాదాపు 20 ఏళ్ల క్రితం శాంతి మహిళా మండలిని ఏర్పాటు చేసి దానికి అధ్యక్షురాలిగా కొనసాగుతూనే మహిళా వృద్ధాశ్రమాన్ని స్థాపించి అమ్మలకు అమ్మగా నిలుస్తోంది పాడిశెట్టి పిచ్చమ్మ.

25 మందికి మూడుపూటలా..

నల్లగొండ మండలం పెద్దసూరారం గ్రామానికి చెందిన పాడిశెట్టి పిచ్చమ్మది వ్యవసాయ కుంటుంబం. ఆమె చిన్నతనంలోనే తండ్రి చినిపోగా తల్లి పెంచి పెద్ద చేసింది. తన 7వ ఏట వివాహం చేయగా 16వ ఏట భర్త చనిపోయాడు. అప్పటికే వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఆమె జీవితంలో ఏదో ఒకటి సాధించాలనుకుంది. పెద్దగా చదువుకోనప్పటికీ రాజకీయ అనుభవం ఉండడంతో 2004లో శాంతి మహిళా మండలిని ఏర్పాటు చేసి కలెక్టరేట్ సమీపంలో ఇంటిని అద్దెకు తీసుకుని అందులోనే మహిళా వృద్ధాశ్రమాన్ని స్థాపించింది. ఆశ్రమంలో 25 మందిని చేర్చుకుని దాతల సహకారంతో వారికి మూడుపూటల బువ్వపెడుతూ అమ్మలా చూసుకుంటోంది. ఒకానొక సమయంలో ఆశ్రమం నడవడం కష్టంగా మారడంతో తన ఒంటిమీదున్న బంగారు ఆభరణాలను సైతం అమ్మి వచ్చిన డబ్బుతో సరుకులు కొనితెచ్చి వృద్ధ మహిళలకు అన్నపెడుతూ నెట్టుకొస్తోంది.

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు

పిచ్చమ్మ సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ఉత్తమ విమెన్ అవార్డును అందుకున్నారు.

కన్న కొడుకులా తలకొరివిపెట్టి..

ఆశ్రమంలో ఉంటూ చనిపోయిన వృద్ధ మహిళలకు పిచ్చమ్మే కన్నకొడుకులా తలకొరివిపెట్టి అంత్యక్రియలు నిర్వహించారు. చనిపోయిన వారి సంబంధికులకు సమాచారం ఇచ్చినా రాకపోవడంతో తానే స్వయంగా అంత్యక్రియలను నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. ఇరవై ఏళ్లుగా ఇప్పటి వరకు చనిపోయిన 21 మందికి తలకొరివి పెట్టింది.

'పిచ్చమ్మ భవన్' నిర్మాణమే లక్ష్యం



జిల్లా కేంద్రంలో పిచ్చమ్మ భవన్ పేరుతో పక్కా భవనాన్ని నిర్మించి అందులో వృద్ధ మహిళలకు ఆశ్రయం కల్పించాలన్నదే తన లక్ష్యం. ప్రభుత్వం, దాతలు భవన నిర్మాణం కోసం సహకారం అందించాలి. ఒక వేళ సహకారం అందని పక్షంలో తనకున్న వ్యవసాయ భూమిని విక్రయించైనా పక్కా భవనం నిర్మిస్తా.

– పాడిశెట్టి పిచ్చమ్మ, శాంతి మహిళా మండలి అధ్యక్షురాలు, నల్లగొండ

ఎన్నో పురస్కారాలు..

అనాథాశ్రమం నిర్వహిస్తూ వృద్ధ మహిళలకు సేవ చేస్తున్న పిచ్చమ్మను ఇప్పటి వరకు ఎన్నో పురస్కారాలు వరించాయి. పలువురు జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు సైతం పిచ్చమ్మను ఎన్నో పురస్కారాలు అందించి సత్కరించారు.

మహిళా దినోత్సవం

ఇద్దరు కొడుకులున్నా.. కూతురు కావాలని..



కూతురు కార్తీక ఇద్దరు కుమారులతో నర్సింహ్మాచారి-మానస దంపతులు

నిడమనూరు : మగపిల్లాడు పుట్టాలని ఎదురుచూస్తున్న ఈ రోజుల్లో ఆ దంపతులు మాత్రం కూతురు కూడా కావాలనుకుంటున్నారు నిడమనూరు మండల కేంద్రానికి చెందిన విశ్వనాథుల నర్సింహ్మాచారి, మానస దంపతులు. తన తల్లిదండ్రులకు నర్సింహాచారి ఒక్కడే సంతానం కావడంతో చిన్నప్పటి నుంచి తోబుట్టువులు లేకుండా పెరిగాడు. అయితే నర్సింహాచారి-మానస దంపతులకు 2014లో మొదటి సంతానంగా కొడుకు (సుప్రీత్) పుట్టాడు. 2016లో రెండో కాన్పులోనూ మళ్లీ మగ పిల్లాడు (మేఘశ్యామ్) పుట్టాడు. మళ్లీ తన కుటుంబంలో ఆడపిల్ల లేకుండా ఉంటుందని ఆలోచించిన నర్సింహాచారి కూతురు కోసం భార్యకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించలేదు. ఈ క్రమంలో బంధుమిత్రులు ఎందరో అవహేళన చేసినా బాధపడలేదు. ఆడపిల్ల కావాలని ఎదురుచూశాడు. 2018లో మూడో సంతానంగా ఆడబిడ్డ పుట్టిందని వినగానే వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆ అమ్మాయికి కార్తీక అని నామకరణం చేసి అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు.

ఆదర్శ మహిళ.. అలుగుబెల్లి విమలమ్మ

- భర్త లేకున్నా అన్నీ తానై కుమారులను ఉన్నత స్థాయికి చేర్చి..
- 12 ఎకరాల భూమిలో సొంతంగా సాగు పనులు



బావి వద్ద మోటార్ పెడుతున్న విమలమ్మ

అర్వపల్లి: భర్త మరణించినప్పటికీ ఆమె కుంగిపోలేదు. చిన్నపిల్లలైన ఇద్దరు కుమారులు, 12 ఎకరాల వ్యవసాయ భూమి సేద్యం బాధ్యతలు చూసుకుంటూ ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తోంది ఆ మహిళ. కుమారులిద్దరినీ ఉన్నత చదువులు చదివించి, వారికి ఉద్యోగాలు వచ్చేలా చేసి, పెళ్లిళ్లు జరిపించింది. అనంతరం కోడళ్లు కూడా ఉద్యోగాలు సంపాదించేలా చేయూతనిచ్చి మంచిస్థాయికి చేర్చింది సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కుంచమర్తి గ్రామానికి చెందిన అలుగుబెల్లి విమలమ్మ.

22 ఏళ్ల క్రితం భర్త మరణించినా..

55 ఏళ్ల ఆమె భర్త శ్రీనివాస్‌రెడ్డి 2000లో మృతిచెందారు. అప్పుడు వారి ఇద్దరు కుమారులు 12ఏళ్ల లోపు వారే. దీంతో కుటంబ భారమంతా ఆమెపైనే పడింది. పెద్దకుమారుడు సంతోష్‌రెడ్డిని ఎంఫార్మసీ వరకు చదివించింది. అలాగే చిన్నకుమారుడు భాస్కర్‌రెడ్డిని బీటెక్ వరకు చదివించి ఇద్దరిని ఉద్యోగులను చేసింది. సంతోష్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ మెడిసిన్ కంపెనీలో ఔషధ తయారీ నిపుణుడిగా పనిచేస్తున్నాడు. భాస్కర్‌రెడ్డి సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అయితే ఇద్దరి కుమారుల పెళ్లిళ్లు కూడా చేసింది. పెద్దకోడలు అమరజ్యోతి కూడా మెడిసిన్ కంపెనీలో కుమారుని మాదిరిగానే ఔషధ తయారీ నిపుణురాలిగా పనిచేస్తుంది. చిన్నకోడలు నాగలక్ష్మి చిన్నకుమారుని మాదరిగానే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తుంది. ఇద్దరు కుమారులకు పిల్లలు కూడా ఉన్నారు. కాగా విమలమ్మ మాత్రం ప్రస్తుతం తమకున్న 12 ఎకరాల భూమిని ఆమె సొంతంగా మగవారికి దీటుగా సాగుచేస్తూ వివిధ రకాల పంటలు పండిస్తూ ఆదర్శ మహిళగా నిలుస్తోంది.

పేదింటి ఆడపడుచులకు చేయూత



బొప్పారంలో ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

కేతేపల్లి : పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూతనందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు కేతేపల్లి మండలం బొప్పారం గ్రామ సర్పంచ్ కక్ర ప్రభాకర్‌రెడ్డి. 2019 జనవరిలో రెండోసారి సర్పంచ్‌గా ఎన్నికైన ప్రభాకర్‌రెడ్డి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూనే గ్రామంలోని పేదింటి ఆడపడుచుల వివాహాలకు ఆర్థిసాయం చేయాలని నిశ్చయించుకున్నారు. ఇందుకోసం ఆయన 2019 ఫిబ్రవరిలో గ్రామ కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద గ్రామంలో ప్రతి ఆడబిడ్డ వివాహానికి సొంతంగా రూ.5,016 ఆర్థికసాయం అందజేస్తున్నారు. నాలుగేళ్లుగా మొత్తం 63 మంది పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థికసాయం అందజేసినట్లు సర్పంచ్ కక్ర ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

భర్త చనిపోయినా మొక్కవోని ధైర్యంతో..

- ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించిన పుష్పలత



కుమార్తెలు ప్రశాంతి, భార్గవితో పుష్పలత

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన ఆకారపు పుష్పలత 2007లో భర్త బ్రహ్మాచారి అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త చనిపోయినా మనోధైర్యం కోల్పోకుండా చిన్న దుకాణాన్ని నడుపుకుంటూ తన ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించింది. పెద్ద కుమార్తె లక్ష్మీప్రసన్నను ఇంజనీరింగ్ చదివించింది. అమెరికాలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో ఆమెకు వివాహం చేసింది. రెండవ కుమార్తె పుష్పలతను ఎంఏ బీఈడీ చదివించగా అదే సమయంలో గ్రూప్ పరీక్షల్లో డిప్యూటీ తహసీల్దారుగా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తోంది. ఆమెకు కూడా గత ఏడాది వివాహం చేసింది. మూడవ కుమార్తె భార్గవిని బీఏ.టీటీసీ చేయించింది. దీంతో ఇటీవల ఆమెకు కూడా వివాహం చేయగా ఉద్యోగ వేటలో ఉంది. భర్త ఆశయ సాధన మేరకు తన ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించి, వారికి వివాహాలు చేసిన పుష్పలత మహిళలకు ఆదర్శంగా నిలిచింది.

మహిళా మేస్త్రీ లక్ష్మి



తాపీ పని చేస్తున్న లక్ష్మి

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట): మండల కేంద్రానికి చెందిన డేగల శ్రీను,లక్ష్మి దంపతులు. వీరికి కొద్దిపాటి వ్యవసాయం ఉంది. లక్ష్మి ఆత్మకూర్ మండల కేంద్రంలో ఏడేళ్ల నుంచి మేస్త్రీలతో కలిసి ఇంటి నిర్మాణ పనులకు వెళ్తోంది. మొదట్లో మేస్త్రీలకు సిమెంటు, ఇటుకలు అందించేందుకు కూలికి వెళ్లేది.కొద్ది రోజుల తరువాత గోడ కట్టెపనిలో మేస్త్రీలకు చేదోడు అందించడంతో వారు లక్ష్మిని ప్రోత్సహించారు. దీంతో లక్ష్మి మగవారితో సమానంగా గోడ కట్టడం,ప్లాస్టింగ్ చేయడం లాంటి పనులను సునాయసంగా చేస్తోంది. ప్రస్తుతం భవనాల నిర్మాణంలో భయం, ఇబ్బంది లేకుండా గోవాలపై నిలబడి పనిచేస్తోంది. మగవారు సైతం ఇబ్బందిగా చేసే రాతి కట్టడాలు, ఇటుకలతో నిర్మాణాలు చేస్తుంది. భర్తకు వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉంటూనే మేస్త్రీగా పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

ఆడపిల్లలకు అండగా..



ఆడపిల్ల పెళ్లిలో నగదు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ లింగస్వామి (ఫైల్)



యువతి పెళ్లిలో నగదు అందజేస్తున్న సర్పంచ్ అద్దెల నర్సిరెడ్డి (ఫైల్)

చిట్యాల: ఆడపిల్లలకు అండగా ఉంటూ, ఆర్థిక చేయూతనందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. చిట్యాల మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు. తాము ఎన్నికల్లో పోటీ చేసే సందర్భాల్లో ఆడపిల్లల కుటుంబాలకు అండగా ఉంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ఔదార్యం..

చిట్యాల మున్సిపాలిటీలోని ఏడో వార్డుకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసిన ప్రస్తుత మున్సిపల్ వైస్‌చైర్మన్ కూరెళ్ల లింగస్వామి ఆ వార్డు పరిధిలో వివాహం అయ్యే ప్రతి ఆడపిల్లకు పదివేల నూట పదహారు రూపాయలను అందజేస్తామని హామీయిచ్చారు. హామీ మేరకు ఇప్పటి వరకు ఆ వార్డులో వివాహం చేసుకున్న 14 మంది యువతులకు నగదును అందజేశారు.

ఆడబిడ్డ పుడితే..

గత మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐదో వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున జడల పూలమ్మ చినమల్లయ్య పోటీ చేసి గెలుపొందారు. వార్డులో పుట్టే ప్రతి ఆడబిడ్డకు పది వేల నూటపదహారు రూపాయలను అందజేస్తామని హామీనిచ్చారు. ఆ మేరకు పన్నెండు మంది ఆడబిడ్డలకు నగదు అందజేశారు.

పదేళ్లుగా..

మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన కంచర్ల బ్రదర్స్ (నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి)లు ఆ గ్రామంలో ఆడ పిల్లల వివాహం సందర్భంగా పదేళ్లుగా ఆర్థిక సహాయాలను అందజేస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు సుమారుగా మూడు వందల మంది ఆడపిల్లల వివాహాల సందర్భంగా ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున నగదును వారు అందజేస్తూ వస్తున్నారు.

వేంబావిలో..

మండలంలోని వేంబావి గ్రామానికి చెందిన అద్దెల నర్సిరెడ్డి నాలుగేళ్ల క్రితం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసే సందర్భంగా గ్రామంలో వివాహం అయ్యే యువతులకు పదివేల పదహారు రూపాయలు ఇస్తానని హామీ నిచ్చారు. ఈ మేరకు 24 మంది యువతుల వివాహ సమయంలో నగదు అందజేస్తూ వస్తున్నారు.

హామీకి కట్టుబడి..



ఆడబిడ్డలకు అండగా ఉండాలని అనుకున్నా. మున్సిపల్ ఎన్నికల్లో మా వార్డులో పోటీచేసే సందర్భంలో ఆడపిల్లల వివాహాలకు పది వేల నూటపదహారు రూపాయలు ఇస్తానని హామీనిచ్చా. ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు 14 మంది యువతులకు నగదు అందజేశా. ఇక ముందు కూడా కొనసాగిస్తా.

– కూరెళ్ల లింగస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్, చిట్యాల

వ్యవసాయంలో భర్తకు తోడుగా..



ట్రాక్టర్ నడుపుతున్న పార్వతమ్మ

నల్లగొండ రూరల్ : నేటి తరం మహిళలు వాహనాలు నడపడమంటే సర్వసాధారణమే. కానీ నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన జక్కల పార్వతమ్మ ఐదు పదుల వయస్సులో వ్యవసాయ పనుల్లో భర్తకు తోడుగా ఉండడమే కాక స్వయంగా ట్రాక్టర్, బైక్ నడుపుతూ ఔరా అనిపించుకుంటటోంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దశరథకు 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీంతో ఆ కుటుంబం వ్యయసాయే ఆధారంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో దశరథ భార్య పార్వతమ్మ 2001లో ట్రాక్టర్, బైక్ నడపడం నేర్చుకొని వ్యవసాయ పనుల్లో భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. పురుషులతో సమానంగా వరాలు పెట్టడం నుంచి నారు పంచడం, మందులు పిచికారీ చేయడం, రాత్రివేళల్లో ఒంటరిగా పొలం వద్దకు వెళ్లి మోటార్ పెట్టడంతోపాటు ట్రాక్టర్‌తో దుక్కులు దున్నడం, గుంటక తోలడం వంటి వ్యవసాయ పనులన్నీ పనిచేస్తూ శభాష్ అనిపించుకుంటోంది.

అమ్మ కష్టంతో పిల్లలు ఉన్నత స్థాయికి..

- భర్త చనిపోయినా ఆత్మస్థైర్యంతో పిల్లలను పెంచి ప్రయోజకులను చేసిన చింతల రంగమ్మ



కుటుంబ సభ్యులతో రంగమ్మ

చౌటుప్పల్: ఆత్మస్థైర్యం ఉంటే సాధించలేని ఏదీ లేదని నిరూపించింది ఆ మహిళ. భర్త చనిపోయినా నలుగురు చిన్నపిల్లలు, వృద్ధులైన అత్తామామలకు అన్నీతానై సాకి పిల్లలను ప్రయోజకులను చేసింది చౌటుప్పల్‌కు చెందిన చింతల రంగమ్మ. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన చింతల రంగమ్మ–సత్తిరెడ్డిలది వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. 35 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్తిరెడ్డి చనిపోయినప్పుడు ఆయన సంతానమైన నలుగురు పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో ఆ కుటుంబ భారం భార్య రంగమ్మపై పడింది. తమకున్న భూమిలో వ్యవసాయం చేయిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించింది.

అమెరికాలో స్థిరపడి..

తన నలుగురు సంతానంలో అందరూ కూడా ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారు. పెద్దకుమారుడు బాలకృష్ణారెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి ఇటీవలే స్వగ్రామానికి వచ్చి ఉంటున్నాడు. పెద్ద కుమార్తె ఉషారాణి భర్త రఘుమారెడ్డి ఎక్సైజ్ డీఎస్పీగా పనిచేస్తున్నాడు. రెండో కుమార్తె ధనలక్ష్మి, ఆమె భర్త సుధాకర్‌రెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. చిన్నకుమారుడు తిరుమల్‌రెడ్డి స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇలా తమ కుమారులు, కూతుళ్లను ప్రయోజకులుగా మార్చి పెళ్లి చేసిన రంగమ్మ నేడు కుమారులు, కుమార్తెలతోపాటు మనవళ్లు, మనుమరాళ్లతో ఆనందంగా గడుపుతూ ఆదర్శంగా నిలుస్తోంది.

పిల్లలకు బాధంటే తెలియనివ్వలేదు



నా భర్త చనిపోయిన నాటికి పిల్లలు చిన్నవయసులో ఉన్నారు. చిన్నతనం నుంచి పిల్లలకు ఎలాంటి బాధ తెలిసీయకుండా పెంచాను. వారి కోరిక మేరకు చదివించాను. ప్రస్తుతం నలుగురు మంచి స్థాయిలో ఉన్నారు.

– చింతల రంగమ్మ, చౌటుప్పల్

బీఆర్ఎస్‌ను వీడే యోచనలో చకిలం

- రేపు సీఎం కేసీఆర్‌కు రాజీనామా లేఖ!
- ఎమ్మెల్సీగా అవకాశం దక్కకపోవడంతో మనస్తాపం
- వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేయాలని నిర్ణయం

సాక్షి ప్రతినిధి నల్లగొండ: బీఆర్ఎస్ నాయకుడు చకిలం అనిల్ కుమార్ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 9వ తేదీన పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం వస్తుందని ఆశించినా మళ్లీ నిరాశే ఎదురైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి స్థానంలో తనకు అవకాశం ఇస్తారని ఆశించారు. తనవంతు ప్రయత్నాలు చేశారు. అయినా ఆయనకు అవకాశం ఇవ్వలేదు. దీంతో ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడాలన్న నిర్ణయానికి వచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

పార్టీ ఆవిర్భావం నుంచి..

టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి చకిలం అనిల్ కుమార్ పార్టీలోనే ఉంటూ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. నల్ల గొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2014, 2018లో రెండుసార్లు ఎమ్మెల్యే టికెట్ దక్కుతుందని భావించినా చివరి నిమిషంలో చేజారిపోయిన విషయం తెలిసిందే. 2018 ఎన్నికల్లో కంచర్ల భూపాల్ రెడ్డికి టీఆర్ఎస్ నుంచి టికెట్ ఇచ్చారు. ఆ సమయంలో చకిలం అనిల్ అలకపూనడంతో ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. నాలుగేళ్లు గడిచినా హామీ అమలు కాలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎలిమినేటి కృష్ణారెడ్డి ఎమ్మెల్సీ పదవీకాలం ఈ నెలతో ముగుస్తోంది. ఆయనతో పాటు మరో రెండు ఎమ్మెల్సీ స్థానాలు కూడా ఖాళీ అవుతున్నాయి. వాటికి ఇప్పటికే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమ్మెల్యేల కోటాలో భర్తీ చేయాల్సిన మూడు ఎమ్మెల్సీ స్థానాలకు కేసీఆర్ మంగళవారం అభ్యర్థులను ప్రకటించారు. అందులో చకిలం అనిల్‌కుమార్ పేరు లేదు. ఎమ్మెల్సీ అవకాశం దక్కకపోవడంతో బీఆర్ఎస్‌ని వీడాలన్న ఆలోచనకు చకిలం వచ్చారు. ఆయన తన రాజీనామా లేఖను గురువారం కేసీఆర్‌కు పంపేందుకు సిద్ధమయ్యారు.

ఇంటికి మరమ్మతులు చేయించేందుకు వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి



ప్రమాద స్థలంలో ఆదిలక్ష్మి, ప్రశాంతి మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ: రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు దుర్మరణం చెందగా తండ్రీకుమారుడికి గాయాలయ్యాయి. దామరచర్ల మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా పొంగులూరు మండలం కొండమంజలూరు గ్రామానికి చెందిన బత్తుల అంకమరావు కుటుంబంతో కలిసి ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఫలక్‌నూమాకు వలస వెళ్లాడు. కొంత నగదు జమ కావడంతో సొంత ఊరిలో తమ పాత ఇంటికి మరమ్మతులు చేయించుకుందామని బత్తుల అంకమరావు, అతని భార్య ఆదిలక్ష్మి(34), కూతురు ప్రశాంతి(11), కుమారుడు అనిల్‌తో కలిసి బైక్‌పై ఉదయం ఫలక్‌నూమా నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ వద్దకు చేరుకున్నాక మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆదిలక్ష్మి, కూతురు ప్రశాంతిలు రోడ్డుపై పడడంతో లారీ వారి తలల మీద నుంచి వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్డు పక్కన మట్టిలో పడిన అంకమరావు, కుమారుడు అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను, మృతదేహాలను స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఏరియా ఆస్పత్రిలో బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా, మృతిచెందిన ప్రశాంతి ఇంటి వద్దనే ఉంటుండగా అనిల్ 5వ తరగతి చదువుతున్నాడు. మృతురాలు ఆదిలక్ష్మి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.